క్లుప్తంగా

కాలభైరవునికి విశేష పూజలు



నగరి: కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయం లోని కాలభైరవునికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. పాలు, పెరుగు పంచామృతం, పన్నీరుతో అభిషేకం చేశారు. అనంతరం స్వామిని పట్టువస్త్రాలు, ఆభరణాలు, వడమాలతో అలంకరించారు. కాలభైరవుని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు కాకవేడు చెరువు వేలం

నగరి: స్థానిక కాకవేడు చెరువులో చేపల వేలం పాటను శనివారం స్థానిక వార్డు సచివాలయం లో నిర్వహించనున్నట్లు కృష్ణాపురం ప్రాజెక్టు మత్స్య అభివృద్ధి అధికారి రామ్‌మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి గలవారు పాటలో పాల్గొనాలని సూచించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



డంపింగ్ యార్డు వద్ద చదును చేయిస్తున్న సర్పంచ్ గోవిందయ్య

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీలో శుక్రవారం పారిశుద్ధ్యం మెరుగుకు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక సర్పంచ్ చొక్కా గోవిందయ్య ఆధ్వర్యంలో ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద శుభ్రం చేశారు. మట్టిని తోలి చదును చేశారు. అక్కడ ఉన్న ముళ్ల కంపలను కూలీల చేత తొలగించారు. అదేవిధంగా తిరుపతి ప్రధాన రహదారి, చిత్తూరు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తా చెదారాన్ని జేసీబీతో తొలగించారు. అంతర్గత రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన మురుగు నీరు, దిబ్బలు, పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేసినట్లు ఈఓపీఆర్డీ పురుషోత్తం తెలిపారు.

రుణ దరఖాస్తుల పరిశీలన



సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన దరఖాస్తుదారులు

పుత్తూరు: బీసీ, ఓసీ కార్పొరేషన్ల రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పరిశీలించారు. కమిషనర్ మంజునాథ్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ కేటగిరీ కింద 595, ఓసీ విభాగంలో 90 దరఖాస్తులు రాగా, ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను పరిశీలించినట్లు వెల్లడించారు.

కేఆర్ పాళెంలో పశు వైద్యశిబిరం

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెంలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి ప్రభాకర్‌వర్మ ఆధ్వర్యంలో పశువులకు పరీక్షలు చేపట్టారు. పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సారా స్థావరాలపై దాడులు



సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

వెదురుకుప్పం: మండలంలోని నక్కలాంపల్లె పరిసర అటవీ ప్రాంతాల్లో సారా తయారీ కేంద్రాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల నల్లబెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. అదేవిధంగా 11 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడా సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని సూచించారు. గ్రామాల్లో సారా తయారీ, జూదం, పేకాట, కోడి పందేలు వంటి ప్రభుత్వ నిషిద్ధ కార్యక్రమాలు కొనసాగిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు.

సారా తయారీ నేరం



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్‌శాఖ సిబ్బంది

శ్రీరంగరాజపురం: సారా తయారీ చట్టరీత్యా నేరమని, ఎవరైనా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ భారతి తెలిపారు. మండలంలోని పెద్ద తయ్యూరు దళితవాడలో ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో గ్రామస్తులు సారా వల్ల కలిగే అనర్థాలు, నష్టాలు, ఆరోగ్యంపై చూపే దుష్ఫలితాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామన్నారు. సారా తయారీని విరమించిన వారికి ప్రభుత్వం రాయితీ రుణాలను మంజూరు చేస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పర్యాటక రంగం అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం శీత కన్ను వేస్తోంది. ప్రోత్సాహం సంగతి దేవుడెరుగు.. సహకారం సైతం గాలిలో దీపంలా మారింది. అందులో భాగంగానే పుత్తూరు పట్టణ ముఖద్వారం వద్ద సందర్శకులకు ఆహ్వానం పలికే పున్నమి (హరిత) రిసార్ట్ మూతపడింది. ఒకప్పుడు ఈ హోటల్ నిత్యం అతిథులతో కళకళలాడుతూ ఉండేది. టూరిజంశాఖకు ప్రతి నెలా రూ.లక్షల ఆదాయం కురిపించేది. ఇప్పుడు పట్టించుకునేవారు లేక నిరుపయోగంగా మారిపోయింది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తయారైంది. ఈ క్రమంలోనే రిసార్ట్ స్థలంపై కూడా కబ్జాదారుల కన్ను పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే హైవే పక్కన అత్యంత విలువైన భూమి ఆక్రమణ చెరలో చిక్కుకోనుంది.



మూతపడిన పుత్తూరు పున్నమి(హరిత)హైవే రిసార్ట్, (ఇన్‌సెట్) రిసార్ట్‌లో ఎండిపోయిన వాటర్ ఫౌంటేన్

పున్నమి లేని పర్యాటకం

- మూతపడిన హరిత హోటల్
- చతికిలపడిన టూరిజం
- పట్టించుకోని ప్రభుత్వం
- విలువైన రిసార్ట్ స్థలం.. ఆక్రమణకు గురయ్యే అవకాశం

పుత్తూరు : పట్టణంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో పున్నమి (హరిత)హోటల్ ఏర్పాటైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఓ వెలుగు వెలిగిన ఈ హోటల్.. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే మూతపడింది. 2002 జూన్ 13వ తేదీన అప్పటి ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి కృషితో ఈ హోటల్ నిర్మించారు. నాటి ఉమ్మడి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి టి.శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా పున్నమి హైవే రిసార్ట్ పేరిట ఘనంగా ప్రారంభించారు. ఈ హోటల్ నిర్మాణం కోసం పుత్తూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 224/18లో 4.46 ఎకరాలను పర్యాటక శాఖకు అప్పగించారు. తిరుపతి–చెన్నై జాతీయ రహదారి 205కు ఆనుకొని ఉన్న కోమటి గుంటతో సహా భూమిని కేటాయించారు. అప్పట్లోనే రూ.60 లక్షల వ్యయంతో రిసార్ట్ నిర్మించారు. 2 ఏసీ, 4 నాన్ ఏసీ గదులు, 50 సీట్ల రెస్టారెంట్, రూఫ్ టాప్ ఓపెన్ ఎయిర్ డైనింగ్ హాల్, షాపింగ్ మాల్, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్, ఇంటర్నెట్ కియాస్క్, సుందరమైన పచ్చిక బయళ్లు, తగినంత పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేశారు. సదరు స్థలంలోని కోమటి గుంటలో పడవ షికారును సైతం ప్రారంభిస్తామని ప్రకటించారు. పడవ షికారు ఏర్పాటు కాకపోయినా రెండు దశాబ్దాలకు పైగా కొనసాగిన ఈ పున్నమి రిసార్ట్ కాలక్రమంలో హరిత రిసార్ట్‌గా మార్పు చెందింది. ఇరవై ఏళ్లుగా పర్యాటకులకు ఆతిథ్యమిచ్చిన ఈ రిసార్ట్ కూటమి ప్రభుత్వం రాకతో మూతపడడం గమనార్హం. తొమ్మిది నెలలుగా మూసిన తలుపులు తెరవకపోవడంతో హోటల్ గదులు, రెస్టారెంట్ హాల్, హోటల్ పరిసరాలు మొత్తం దుమ్ముధూళితో నిండి పోయాయి.

రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆక్రమణకు అవకాశం

పున్నమి హైవే రిసార్ట్‌కు చెందిన విలువైన భవనాలు, భూమి, గుంట ఆక్రమణల పాలయ్యే అవకాశం ఉంది. గతంలో ఈ రిసార్ట్ సమీప గ్రామాలైన తిమ్మాపురం, ఈశ్వరాపురం, మహాలక్ష్మీపురంవాసులు ఇక్కడి కోమటి గుంటను పశువుల దాహార్తికి వినియోగించుకోవడమే కాకుండా మూడు గ్రామాల ప్రజలు కర్మక్రియలు ఇక్కడే నిర్వహించుకొనేవారు. రిసార్ట్‌కు కేటాయించిన తర్వాత పర్యాటక శాఖ వారు ఈగుంటలోకి ఎవరినీ అనుమతించకపోవడంతో రెండు దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉంది. రిసార్ట్‌కు చెందిన ఈ మొత్తం స్థలం జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో ప్రస్తుతం దీని విలువ రూ.కోట్లకు చేరింది. విలువైన భవనాలు, భూమిని ఇలా గాలికి వదిలేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే కొంత కాలం గడిస్తే అత్యంత విలువైన సథలం ఆక్రమణదారుల పాలవుతుందని హెచ్చరిస్తున్నారు. పర్యాటక శాఖ అధీనంలోని స్థలాన్ని మళ్లీ రెవెన్యూ లేక మున్సిపాలిటీకి అప్పగించి ప్రభుత్వ అవసరాల నిమిత్తం వినియోగించాలని కోరుతున్నారు. దీనిపై పుత్తూరు



బోటింగ్ కోసం కేటాయించిన కోమటి గుంట

పున్నమి హోటల్ మూసివేతపై ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్‌ను వివరణ కోరేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. తిరుపతిలోని పర్యాటక శాఖ కార్యాలయంలో విధులు నిర్వర్తించే ఆయనను సంప్రదించేందుకు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడం గమనార్హం.

ప్రజావసరాలకు వాడాలి



రూ.కోట్లు విలువ చేసే పున్నమి హైవే రిసార్ట్ భవనాలు, స్థలాన్ని పర్యాటక శాఖ వారు మున్సిపాలిటీకి అప్పగించాలి. పుత్తూరు పట్టణంలో పర్యాటక శాఖ కార్యాలయమే లేదు. అలాంటప్పుడు ఆశాఖ చేతిలో విలువైన భూములు ఉండడం అనవసరం. ప్రజల అవసరాలకు సదరు భవనాలు వినియోగించడం ద్వారా ప్రభుత్వ ఆస్తులను కాపాడవచ్చు.

–ఎం.అనిల్‌కుమార్, ఈశ్వరాపురం

గుంటను పరిరక్షించాలి



పున్నమి హోటల్‌కు కేటాయించిన కోమటి గుంటను పరిరక్షించాలి. అలాగే పాడి రైతులు వినియోగించుకొనే విధంగా చర్యలు చేపట్టాలి. గుంటను పూడ్చకుండా అలాగే ఉంచితే భూగర్భ జలాలు వృద్ధి చెంది, ఈ ప్రాంతంలో నీటి సమస్యతలెత్తకుండా ఉంటుంది. ఆ దిశగా అధికారులు ప్రణాళిక రూపొందించి, అమలు చేయాలి.

–యువరాజు, మహాలక్ష్మీపురం

దారి ఏర్పాటు చేయాలి




పర్యాటక శాఖకు కోమటి గుంటను కేటాయించడంతో అక్కడే ఉన్న కనికలమ్మ ఆలయం అభివృద్ధి చెందుతుందని భావించాం. అయితే ఆలయానికి వెళ్లే దారిని సైతం మూసేశారు. దీంతో గ్రామస్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఇకనైనా కనికలమ్మ ఆలయానికి వెళ్లేందుకు సరైన దారిని ఏర్పాటు చేయాలి.

–ఎన్.పెరుమాళ్‌రెడ్డి, తిమ్మాపురం

28లోపు రైతుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నింద్ర: మండలంలోని రైతులు తప్పనిసరిగా ఈ నెల 28వ తేదీలోపు ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో నమోదు చేసుకోవాలని ఏఓ తులసీరాం తెలిపారు. శుక్రవారం ఆయన మట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ప్రభుత్వ పథకాలు అందుతాయని వెల్లడించారు.

ముగిసిన 'గజ్జ పూజ కోలాటం'



కోలాటమాడుతున్న మహిళలు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం పూడి ఆదిఆంధ్రవాడ అంకాల పరమేశ్వరి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గజ్జ పూజ కోలాటం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. 500 మంది భక్తులకు దాత రవళి, జయంతిబాబు కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు.

కూలి రేటు పెంచాలని వినతి



ఆర్‌డీఓకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

నగరి: మరమగ్గ కార్మికులకు కూలీ రేటు పెంచాలని మరమగ్గ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ కోరారు. శుక్రవారం మరమగ్గ కార్మికులతో కలిసి ఆర్‌డీఓ భవానీ శంకరికి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో దాదాపు పదివేల కుటుంబాలునేత వృత్తి మీదే ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. 2012 తర్వాత మరమగ్గ కార్మికులకు కూలి రేట్లు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు మాస్టర్ వీవర్లతో చర్చించి గతంలో ఇచ్చిన హామీ మేరకు కూలీ పెంపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్లక్ష్యం వహిస్తే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు షణ్ముగం, గణపతి, మైలుస్వామి పాల్గొన్నారు.

'నవోదయం'తో నవ సమాజం



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి

నగరి: నవోదయం 2.0తో సారా రహిత నవ సమాజానికి అడుగులు పడతాయని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని అడవికొత్తూరులో నాటు సారా అనర్థాలపై అవగాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనం సారా తాగి ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారన్నారు. యువకులు మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే నాటు సారాను నిర్మూలించేందుకు నవోదయం పథకం చేపట్టామని వెల్లడించారు. సారా తయారీ, అమ్మకాలపై టోల్ ఫ్రీ నంబర్ 14405, 9440902549 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంట్లో సోదాలు



గ్రామస్తులు ఎదురు తిరగడంతో వెనుదిరుగుతున్న పోలీసులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను లక్ష్యంగా చేసుకుని పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం శ్రీరంగరాజపురం మండలంలోని మిట్టదళితవాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు యోగానందం చిన్నపాటి చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. ఉదయం కొంత మంది స్థానిక పోలీసులు అతని దుకాణం నిర్వహించే ఇంట్లోకి చొరబడి తనిఖీలు నిర్వహించారు. ఇంట్లో ఉన్న మహిళలు, చిన్నారులు భయభ్రాంతులకు గురయ్యారు. ఎందుకు తనిఖీలు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ప్రశ్నించారు. యోగానందం బెల్టుషాప్ నిర్వహిస్తున్నారని, అందుకే తాము తనిఖీ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే అక్కడ ఏమీ లభించలేదు. అదే గ్రామంలో టీడీపీ సానుభూతిపరులు చిల్లర దుకాణం నిర్వహిస్తున్నప్పటికీ వారి వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. పోలీసుల తీరు చూస్తుంటే వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లనే లక్ష్యంగా చేసుకున్నట్లు ఇబ్బంది పెడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఇలా అధికార పక్షానికి కొమ్ముకాస్తూ ఇబ్బంది పెట్టడం ఏంటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం



నగరిలో..



గెలుపొందిన విద్యార్థులతో భాషా బోధకులు

గంగాధరనెల్లూరు: మండలంలోని అక్కనగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఈ సందర్భంగా అక్కనగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం గంగాధరం ఆధ్వర్యంలో పిల్లలకు గేయాలు, కోలాటం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ మాతృభాషను మరిచిపోకుండా భావితరాలకు అందించాలని, మాతృభాషలో ప్రతి ఒక్కరూ పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు పిల్లలు కలిసి గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సరిత పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నగరి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ మాట్లాడుతూ ఉనికి.. వ్యక్తిత్వ వికాసానికి భాష, సంస్కృతులే దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.భాస్కర రాజు, తెలుగు విభాగాధిపతి డాక్టర్ సి. చిన్న పాపమ్మ, తమిళ విభాగం అధ్యాపకులు ఎస్. జ్యోతి, పాల్గొన్నారు.

పుత్తూరు: మాతృభాషను తల్లితో సమానంగా గౌరవించాలని గొల్లపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భారతి పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకుఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లి మిట్ట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు గత నాలుగు రోజులుగా మాతృభాషా ఉత్సవాలు నిర్వహిస్తునట్లు హెచ్‌ఎం శాంతి తెలిపారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. హెచ్‌ఎం శాంతి మాట్లాడుతూ భాష ఏదైనా తల్లితో సమానమన్నారు. కార్యక్రమంలో భాషాబోధకులు పాల్గొన్నారు.

విద్యార్థికి నివాళి



బాలాజీకి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

పుత్తూరు: రైలు ఢీకొని మృతి చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం.బాలాజీ(20)కి అధ్యాపకులు, సహచర విద్యార్థులు నివాళులర్పించారు. శుక్రవారం కళాశాలలో సంతాప సభ నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య మాట్లాడుతూ గురువారం సైతం కళాశాల వచ్చి వెళ్లిన బాలాజీ అదేరోజు రాత్రి 8 గంటల సమయంలో పుత్తూరు రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడడం కలచివేసిందన్నారు. అనంతరం బాలాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమ్మభాషను మరువద్దు



వివిధ వేషధారణల్లో ఛాత్రోపాధ్యాయులు

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ డైట్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ అమ్మ ఒడిలో నేర్చుకునేది మాతృభాష అని, జీవనోపాధి కోసం ఎన్ని భాషలు నేర్చుకున్నా మన మాతృభాషను మరవకూడదన్నారు. అనంతరం పలువురు కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ మాతృభాష విశిష్టతను కొనియాడారు. అనంతరం మాతృభాషపై ఛాత్రోపాధ్యాయులు నిర్వహించిన నాటికలు, నృత్యాలు, ఏకపాత్రాభినయం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధ్యాపకులు చెంగల్‌రాజు, మహ్మద్‌రఫీ, వెంకటరమణ, నాగరాజనాయక్, శ్రీనివాసులు, దేవప్రసాద్, అనిత పాల్గొన్నారు.

లింకేజీ రుణాలపై అవగాహన



మాట్లాడుతున్న మేనేజర్ వినోద్ కుమార్

పాలసముద్రం: డ్వాక్రా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలను సక్రమంగా కంతుల ప్రకారం కడితే, రూ.2 లక్షలు ఇస్తామని సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం కల్పలతరెడ్డి ఆధ్వర్యంలో సంఘమిత్ర, వీఓ లీడర్లకు సమీక్ష నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సభ్యులు పొదుపులు, బ్యాంకు లింకేజీ రుణాలను సక్రమంగా చెల్లించిన సంఘాల సభ్యులకు రూ.2 లక్షల వరకు రుణాలు ఇస్తామని తెలిపారు. తీసుకున్న రుణాలను వృథాగా ఖర్చు పెట్టకుండా పెట్టుబడి ఎక్కువగా వచ్చేవాటిపై పెట్టి ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. అర్హత ఉన్న కొత్త గ్రూపులకు కూడా రుణాలు ఇస్తామని తెలిపారు. సంఘమిత్రాలు తప్పకుండా నెలకు ఒక రోజైనా ప్రతి గ్రూపును సమీక్ష నిర్వహించి సంఘ సభ్యులు తీసుకున్న రుణాలను కొట్టివేతలు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్రాలు,, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్

కార్వేటినగరం: రోడ్డు భద్రతా నియమాలను పాటించడం పౌరులందరి బాధ్యత అని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై అవగాహన చాలా ముఖ్యమన్నారు. రోడ్డు భద్రత నియమాలు తెలుసుకోవడం, అలాగే పాటించడం పౌరులందరి బాధ్యత అన్నారు. అంతేకాకుండా విద్యార్థులంతా మత్తు పానీయాల జోలికి పోకుండా మీ తోటి వారికి కూడా అవగాహన కల్పించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్ఐ రాజ్ కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాల్లో భాగంగా హెల్మెట్, సీటు బెల్టు ధరించడం ద్వారా ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. హెల్మెట్ వాడని వారు ప్రమాదాల్లో 80 శాతం మంది మృత్యువాత పడుతున్నారని, ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్, కారు డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవడం తప్పనిసరి అన్నారు. ఈ క్రమంలో భాగంగా రోడ్డు భద్రతకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను రూపొందించిన విద్యార్థి భానుప్రకాష్‌ను డీఎస్పీ అభినందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి మాట్లాడుతూ అతి చిన్నవయసులో డీఎస్పీ అయిన సయ్యద్ మహ్మద్ అజీజ్ విద్యార్థులకు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనంజయరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.